ప్రారంభ ధర రూ.8 లక్షలు

జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థ హోండా.. థర్డ్ జనరేషన్‌గా దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త అమేజ్ మాడల్‌ను విడుదల చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ధరల శ్రేణి రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా ఉన్నది.

అమెరికా-చైనా టెక్ వార్

ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం

సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు

వాషింగ్టన్/బీజింగ్, డిసెంబర్ 4: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్-ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

చైనా ప్రతీకార చర్యలు

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమొని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలా చాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలా చాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడినట్టైంది. అంతకుముందు అమెరికా.. కొత్తతరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది. గతంలోనూ వీటిపై నిషేధం విధించినా ఆ తర్వాత సడలించింది. మానవ సాయంతో నిమిత్తం లేకుండా స్వయంప్రతిపత్తితో పనిచేయగలిగిన ఆయుధాల తయారీలో ఈ చిప్‌లే కీలకం. వాటి విడిభాగాలు ప్రస్తుతం అమెరికా నుంచే చైనాకు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు

ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు



ట్రంప్ రాకముందే..

అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దెనెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారితీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా-చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు. ఇక ట్రంప్ హయాంలో చైనా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున జరిగే ఎగుమతుల కట్టడే లక్ష్యంగా సుంకాల పెంపు జరిగింది. కానీ ఇప్పుడు చిప్ తయారీలో ఆధిపత్యం కేంద్రంగా నిర్ణయాలుంటున్నాయి. మొత్తానికి వచ్చే ఏడాది నుంచి సెమీకండక్టర్ ఇండస్ట్రీల్లో అలజడులు ఖాయమనే చెప్పవచ్చు.

భారత్‌కు లాభమేనా?

అమెరికా-చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా-చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్

రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ



హైదరాబాద్, డిసెంబర్ 4: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రీ తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రముఖ వంటనూనెల ఉత్పత్తి సంస్థ గోల్డ్‌డ్రాప్‌ను మరోసారి ప్రతిష్ఠాత్మక సీఐటీడీ అవార్డు వరించింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా అందుకున్నారు.

బీసీబంధు పథకం అమలు చేయాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబర్4 (నమస్తే తెలంగాణ): బీసీబంధు పథకాన్ని వెంటనే అమలుచేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరారు.

బుర్రా వీఆర్‌ఎస్‌కు ఆమోదం

నేడు టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ): సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణకు ఆమోదం తెలుపుతూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. విద్యాశాఖ స్పెషల్ సీఎస్‌గా పనిచేస్తున్న ఆయన్ని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఇంటర్నెట్ సర్ఫ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్..హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్‌ఈసీ)ని నెలకొల్పడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దేశంలో తొలి సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ కాగా, అలాగే ప్రపంచంలోనే ఐదోది కావడం విశేషం. ఈ జీఎస్‌ఈసీ ఏర్పాటుకు సంబంధించి గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం హాన్సెన్ మాట్లాడుతూ..డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రాష్ట్రం ముందంజలో ఉన్నదని, ప్రపంచవ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదన్నారు. ఈ నూతన సేఫ్టీ సెంటర్ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి వీలు పడనున్నదన్నారు. అలాగే ఈ సెంటర్‌తో వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులకు కిక్కు

జీఎస్‌ఈసీ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనున్నది. ఏఐ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకారం అందించనున్నది. ఇదిలావుంటే దేశంలో నైపుణ్యాభివృద్ధిని, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనున్నది.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్

కొనసాగుతున్న రూపీ పతనం

ముంబై, డిసెంబర్ 4: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుపీ-డాలర్ రేటు 64.65-84.76 స్థాయిలో కదలాడింది.

చట్టసభలకు ప్రశ్నించే గొంతుకను పంపిద్దాం

- ఈ నెల వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- సంక్షేమ రంగానికి తూట్లు పొడుస్తున్న రేవంత్ సర్కార్
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాంయాదవ్

మాట్లాడుతున్న రాజారాం యాదవ్

బాన్సువాడ, డిసెంబర్ 4: చట్ట సభల్లోకి ప్రశ్నించే గొంతుకలు, ప్రజాస్వామ్య రక్షకులను పంపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాం యాదవ్ అన్నారు. ఈ నెల 9 వరకు పట్టభద్రుల ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గురుకుల బాటలో భాగంగా బుధవారం ఆయన బాన్సువాడ నియోజకవర్గంలో పర్యటించారు. బాన్సువాడ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందినట్లు చెప్పారు. కాం గ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం ఏడాదిలోనే ఎలా వెనుకబాటుకు గురవుతున్నదో ప్రజ లు గమనిస్తున్నారని తెలిపారు. రేవంత్ ప్రభు త్వం సంక్షేమ రంగాన్ని విస్మరిస్తూ, పథకాలకు తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు. పదేండ్ల కాలంలో కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తే.. రేవంత్‌రెడ్డి ధ్వంసం చేస్తున్నాడని విమర్శించారు. ధ్వంసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు ఇచ్చి తాము ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని ప్రగల్భాలు పలికి ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 12,527 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తుచేశారు. రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలను నిరుద్యోగులు, మేధావులు, పట్టభద్రులు గమనించాలని సూచించారు.

పాలనను గాలికొదిలేసిన రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గురుకులాలను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినట్లు తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ గురుకులాలను ఏం చేస్తున్నదో తెలంగాణ సమాజం గమనించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఏడాదిలో సుమారు 40 మంది విద్యార్థుల ప్రాణాలు పోతే కనీసం ఆ శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి సమీక్షించిన దాఖలా లు లేవన్నారు. తెలంగాణ ఉద్యమాల గడ్డ అని, పోలీసు కేసులకు భయపడేది లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు, బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, వార్డు మాజీ సభ్యుడు మోచి గణేశ్, విద్యార్థి సంఘం నాయకులు సాయిబాబా, రమేశ్ యాదవ్, లింగం, అనిల్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అసాధారణ

పార్ట్-II సెక్షన్ 3 సబ్ - సెక్షన్ (ii)

రైల్వే మంత్రిత్వ శాఖ

(దక్షిణ మధ్య రైల్వే)

PUB/1207

ప్రకటన

సికింద్రాబాద్, 27 నవంబర్ 2024

S.O.5194 (E)- రైల్వే యాక్ట్, 1989 (24 ఆఫ్ 1989) (ఇకపై సదరు చట్టంగా రిఫర్ చేయబడును)లోని సెక్షన్ 20Aలో సబ్-సెక్షన్(I) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ, తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్, నిజామాబాద్ బైపాస్ లైన్ నిర్వహణ కొరకు దిగువ షెడ్యూలులో సంక్షిప్తంగా వివరించిన భూమి ప్రజోపయోగార్థం అవసరమైనదని సంతృప్తి చెందిన మీదట కేంద్ర ప్రభుత్వం సదరు భూమిని సేకరించాలనే ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనంగల ఎవరైనా వ్యక్తి అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజులలోగా, సదరు చట్టంలోని సెక్షన్ 20Dలో సబ్-సెక్షన్(1) క్రింద పై ఉద్దేశ్యం కొరకు సదరు భూమి సేకరణ మరియు వినియోగానికి అభ్యంతరం తెలుపవచ్చు.

అటువంటి ప్రతి అభ్యంతరాన్ని సమర్థ ప్రాధికారి అనగా రెవెన్యూ డివిజినల్ అధికారి, నిజామాబాద్ జిల్లా వారికి వ్రాతపూర్వకంగా, వాటి కారణాలను తెలుపుతూ తెలియజేయాలి. అభ్యంతరం తెలిపే వ్యక్తికి స్వయంగా కాని లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా కాని తెలియజేసే అవకాశాన్ని సమర్థ ప్రాధికారి రెవెన్యూ డివిజినల్ అధికారి, నిజామాబాద్ జిల్లా వారు ఇస్తారు. అటువంటి అన్ని అభ్యంతరాలను విచారించిన తరువాత మరియు ఏదేని తదుపరి విచారణ చేసిన తర్వాత, సమర్థ ప్రాధికారి అవసరమని భావించిన విధంగా, ఉత్తర్వు ద్వారా అభ్యంతరాలను అనుమతించవచ్చు లేదా అనుమతించకపోవచ్చు.

సదరు చట్టంలోని సెక్షన్ 20(D)లో సబ్-సెక్షన్(II) క్రింద సమర్థ ప్రాధికారి చేసిన ఏదేని ఉత్తర్వు తుదిగా ఉంటుంది.

ఈ ప్రకటన పరిధిలో సేకరించవలసిన భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు పైన తెలిపిన సమర్థ ప్రాధికారి కార్యాలయంలో లభిస్తాయి మరియు వాటిని ప్రయోజనంగల వ్యక్తి తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలోని స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్-నిజామాబాద్ బైపాస్ లైన్ కొరకు కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా సేకరించుట భూమి సంక్షిప్త వివరణ.

రాష్ట్రం: తెలంగాణ | జిల్లా: నిజామాబాద్

గ్రామం: పంగ్రా

క్రమ సంఖ్య	సర్వే నం.	మొత్తం విస్తీర్ణం (ఎకరాలు)	కేస్ వివరాలు
1	158	0.130	నిజామాబాద్ బైపాస్ లైన్
2	159	0.120	
3	160	0.080	
4	161	0.040	
5	162	0.670	
6	163	1.530	నిజామాబాద్ బైపాస్ లైన్
7	164	3.570	
8	165	3.140	
9	166	1.150	
10	167	0.440	
11	168	0.250	
12	174	1.070	
13	176	0.540	
14	177	0.100	
15	179	0.380	
16	180	0.360	
17	181	0.440	
18	182	0.120	
	మొత్తం	14.130	

గ్రామం: గోపన్‌పల్లె

క్రమ సంఖ్య	సర్వే నం.	మొత్తం విస్తీర్ణం (ఎకరాలు)	కేస్ వివరాలు
1	398	1.080	నిజామాబాద్ బైపాస్ లైన్
2	400	1.722	
3	390	0.030	
4	391	0.090	
5	389	2.560	
	మొత్తం	5.482	

[File No. : Y/GS/NZB Bypass/eGaz/2024/20A/1]

(ఎల్. సాంబశివ రావు), చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతి శక్తి/II/SC

దక్షిణ మధ్య రైల్వే

A1547

టైలరింగ్ సర్టిఫికెట్ల అందజేత

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 4: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో బుధవారం అక్షయ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన 20మందికి సర్టిఫికెట్లు అందజేశారు. సర్టిఫికెట్లు విశ్వకర్మ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్ లోన్లకోసం ఉపయోగపడతాయని ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ భూపాల్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థినులు ఉన్నారు.

'దివ్యాంగ పిల్లలు అధైర్యపడొద్దు'

గాంధారి, డిసెంబర్ 4: దివ్యాంగ పిల్లలు అధైర్య పడకూడదని ఎంఈవో శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల చిన్నారుల కోసం భవిత కేంద్రంలో ప్రతి వారం ఫిజియోథెరపీ చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్లేట్లను అందజేశారు.పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

లింగంపేట, డిసెంబర్ 4: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో షౌకత్ అలీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల హాజరుపట్టిక పరిశీలించారు. విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 4 : మండలంలోని కాటేపల్లి, కాటేపల్లి తండాపాఠశాలలను బుధవారం ఎంపీడీవో లక్ష్మీకాంతారావు సందర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

బహుమతులు అందజేస్తున్న ఎంఈవో వెంకన్న

నస్రుల్లాబాద్, డిసెంబర్ 4 : బీర్కూర్‌లోని భవిత సెంటర్ కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకన్న, ఎంపీడీవో భానుప్రకాశ్, మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వెంకన్న బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వంట పాత్రలు, సరుకుల గడువు తేదీని పరిశీలించారు. ఎంఈవో వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మాట్లాడుతున్న మండల విద్యాధికారి పూర్ణచంద్రారావు

రాజంపేట్, డిసెంబర్ 4 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి పూర్ణచంద్రరావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్థివ దేహాన్ని దానం చేయడం అభినందనీయం

నక్క నర్సింహులు దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

కామారెడ్డి, డిసెంబర్ 4 : బీబీపేట గ్రామానికి చెందిన జిల్లా పోస్టల్ శాఖ విశ్రాంత ఉద్యోగి నక్క నర్సింహులు భార్య సుగుణ వారి కుటుంబ సభ్యుల ఆమోదంతో మరణానంతరం వారి పార్థివ దేహాన్ని కామారెడ్డి మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల పరీక్షల నిమిత్తం దానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా ఏరియా దవాఖానలో దంపతులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదాబేగం, వైద్యులు, దవాఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కేటాయించిన స్థలం గ్రంథాలయానికి ఇవ్వాలి'

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 4: మండల పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న స్థలం గ్రంథాలయానికి కేటాయించారని.. ఆ స్థలం గ్రంథాలయానికే ఉంచాలని గ్రంథపాలకుడు జాకీర్ బుధవారం ఎంపీడీవో ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు 2016లో అప్పటి ఎంపీడీవో స్థలం కేటాయించారన్నారు. ఆ స్థలంలో ఇప్పుడు మోడల్ గృహ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిసిందని.. కేటాయించిన స్థలం గ్రంథాలయానికి ఉంచాలని కోరారు.

రేషన్ షాపు ప్రారంభం

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 4 : మండలంలోని పోచారం గ్రామంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు నూతన రేషన్ షాపును బుధవారం ప్రారంభించారు. అనంతరం కాస్లాబాద్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్ల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ దశరథ్, నాయకులు పాల్గొన్నారు.